వ్యాస కౌముది



**మనభారతం** **డా.వల్లూరుపల్లి శివాజీరావు**

# 125
# మహాత్మా గాంధి-31



*ఈ సంచికలో గాంధీజీని 'మహాత్మా' అనే బిరుదు నొసంగిన మొదటి వ్యక్తి గురించి, రవీంద్రనాథ ఠాగూర్ తో గాంధీజీ మొదటి సమావేశం, గాంధీజీ ప్రవేశపెట్టిన స్వయంకృషి పథకం, తన ప్రాణ మిత్రుడు డా. ప్రాణ్ జీవన్ మెహతా తో సమావేశం, అహ్మ దాబాద్ లో ఆశ్రమం స్థాపన, మొదలగు విషయాల గురించి తెలుసుకుందాము.*

## డా. ప్రాణ్ జీవన్ మెహతా (Dr. Pranjivan Mehta)

బొంబాయిలో జన్మించిన గాంధీజీకి ప్రాణ్ జీవన్ మెహతా బాల్య స్నేహితుడు. ఈయన వైద్యుడిగాక, బారి ష్టర్, స్వర్ణకారుడు (jeweller) కూడా. ఆయన గాంధీజీ వలె బొంబాయి, లండన్, దక్షిణ ఆఫ్రికాలో గడిపి చివరకు బర్మాలోని రంగూన్ లో స్థిరపడ్డారు. అచ్చట ఆయన United Burma అనే ఆంగ్లపత్రిక నిర్వహిం చారు. ఆ సమయంలో Dr. మెహతా అందరికంటే ముందు గాంధీజీలో ఉన్న సామర్ధ్యం గుర్తించి గోఖలే, తదితరులకు తెలియజేశారు. ఈయన గాంధీజీకి అనేకసార్లు ఆర్థిక సహాయం కూడా చేశారు. అయినా Dr. మెహతా దీనిని ఎన్నడూ ప్రచారం చేసుకోలేదు.

'మహాత్మా' అనే బిరుదుతో పిలువబడటానికి అర్హుడైన వ్యక్తి గాంధీజీ అని కీర్తించిన మొట్టమొ దటి వ్యక్తి ఈ Dr. మెహతా యే గాని, వేరే ఎవరూ కాదు. 1909 లో నవంబర్ 8 వ తేదీని గోఖలే కు వ్రాసిన ఉత్తరంలో గాంధీజీ గురించి Dr. మెహతా ఈ విధంగా తెలియజేశాడు: "20 ఏళ్లకు పైగా అతనితో సన్ని హితంగా ఉన్న నాకు గాంధి క్రమక్రమంగా

మరింత నిస్వార్ధపరుడుగా పరివర్తన చెందటం చూశాను. ప్రస్తుతం ఆయన దాదాపు ఒక సన్యాసి జీవితాన్ని గడుపుతున్నాడు. అలా అని అతను మనం మామూ లుగా చూసే ఒక సాధారణ సన్యాసి కాదు; ఎంత సేపూ మనసులో తన జన్మభూమి (భారతదేశం) గురించిన ఆలోచనలో మునిగిపోయిన '***గొప్ప ఆత్మ***' (Great-Soul) ఉన్న వ్యక్తి ఆయన. **గొప్ప (మంచి) ఆత్మ** కల వాడు కాబట్టి అతనిని 'మహాత్మా' అని సంబోధించవచ్చు."

ఈ 'మహాత్మా' అనే బిరుదు గాంధీజీ జీవించి ఉన్నన్నాళ్లు, ఆ తరువాత కూడా ఆయన పేరుకు 'ఉపసర్గ' (Prefix) గా శాశ్వతంగా నిలిచిపోయింది.

**రవీంద్రనాథ్ ఠాగూర్-గాంధీజీ సమావేశం**

భారతదేశం గర్వించదగ్గ పుత్రులలో రవీంద్రనాథ్ ఠాగూర్, గాంధీజీ అతి ముఖ్యులు. వీరిద్దరు తమ తమ రంగాలలో గణనీయమైన కృషి చేశారు. ఠాగూర్ సాహిత్య రంగంలో దిట్ట, నోబెల్ గ్రహీత (1913 లో) అయితే, గాంధీజీ రాజకీయ రంగంలో అసమానమైన ఘనకీర్తిని కిరీటంగా ధరించిన మహనీయుడు. భారతదేశం కల్లోలంలో ఉన్న సమయంలో వీరు సమకాలికులు. ఆంగ్లేయ పాలనకు, పెట్టుబడిదారీ విధానమునకు వీరిద్దరు వ్యతిరేకులైనా, అనేక విషయాలపై విభేదించారు.

ఈ ఇద్దరు దిగ్గజాలు అప్పటికే ఒకరిని గురించి మరొకరికి బాగా తెలిసినా, వీరిరువురిని కలిపింది ఒక ఆంగ్లేయుడైన Charles Andrews. ఈయన దక్షిణ ఆఫ్రికాలో గాంధీజీతో కలిసి పనిచేశారు. గాంధీజీ దక్షిణ ఆఫ్రికా నుంచి లండన్ మీదుగా జనవరి 9 వ తేదీన (1915 లో) భారతదేశం తిరిగి వచ్చిన తరు వాత Andrews ఈ మహనీయుడిని ఫిబ్రవరిలో ఒక వారం రోజులు శాంతినికేతన్ ఉండేటట్లుగా ఏర్పాటు చేశారు. కాని ఠాగూర్ ఆ సమయంలో అచ్చట లేనందువల్ల అయన కోసం ఒక వారం రోజులు వేచి ఉన్నా రు. శాంతినికేతన్ లో ఉన్న సమయంలో గోఖలే (19 ఫిబ్రవరి) మరణించినట్లు తెలియగానే గాంధీజీ పూనా వెళ్లి అయన అంతిమ సంస్కారంలో పాల్గొనటం జరిగింది.

Andrews అభ్యర్ధన మేరకు గాంధీజీ తిరిగి ఫిబ్రవరి చివరి వారంలో మగన్ లాల్ గాంధితో కలిసి శాంతినికేతన్ చేరుకున్నారు. అచ్చట ఆండ్రూస్ తోపాటు శాంతినికేతన్ లోని ఆచార్యులు William Pearson (కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి) కూడా ఉన్నారు. వీరే గాక గాంధీజీని కలవటానికి బెంగాలీ ఉపాధ్యాయులు కూడా

ఉన్నారు. వీరిలో ముఖ్యులు జగదానంద బాబు, నేపాల్ బాబు, సంతో షుబాబు, క్షితిమోహనబాబు నాగేంద్రబాబు, శరద్ బాబు, కాళీబాబు.

చివరికి ఠాగూర్, గాంధీజీ తొలిసమావేశం మార్చి 6 వ తేదీన (1915 లో) జరిగింది. ఈ సమావేశం గురించి గాంధీజీ సన్నిహితుడు Kaka Kalelkar (Dattatreya Kalelkar) ఇలా వివరించారు: "నాతోపాటు అందరు ఉపాధ్యాయులు ఈ భరతమాత పుత్రులు మొదటిసారి కలిసిన ప్పుడు ఒకరితో ఒకరు ఎలా ప్రవర్తిస్తారు అని కుతూహలంగా ఎదురుచూస్తున్నాము. ...మేము గాంధీజీ వెంట రవీంద్రనాథ్ ఠాగూర్ ఉన్న గదికి వెళ్ళాము. అప్పుడు తెల్ల జుట్టు, పొడుగాటి గడ్డం, ఆకట్టుకునే ఆహార్యంతో ఉన్న 6 అడుగుల లో పొడగరి 'రవిబాబు' (ఠాగూర్) తన సోఫాలో నుంచి లేచి నలిగిన ధోవతి (ధోతి), తల మీద కాశ్మీరీ టోపీ ధరిం చిన పొట్టి వ్యక్తి (5 అడుగుల 4 అంగుళాలు) వ్యక్తిని చూసి '***మహాత్మా!*** రండి' అని గాంధీజీని సాదరంగా స్వాగతం పలికారు."

"ఈ సన్నివేశం ఒక సింహం ఒక ఎలుకకు ఎదురుపడినట్లుగా ఉంది. వీరిద్దరికి ఒకరి యెడల ఒకరికి హృదయపూర్వక గౌరవం ఉన్నదని మాకు తెలుసు. 54 ఏళ్ల రవిబాబు తానూ ఆసీనుడయ్యే సోఫాలో తన ప్రక్కన కూర్చోమని 46 ఏళ్ల గాంధీజీకి సైగ చేశారు. కాని గాంధీజీ నేలమీద పరచిఉన్న తివాచీని చూసి దాని మీద కూర్చున్నారు. అది '***గురుదేవ్***' చూసి తప్పనిసరిగా, మర్యాద పూర్వకంగా ఆయన ***మహాత్మా***జీని అనుసరించారు (కూర్చున్నారు)."

వీరిరువురు దక్షిణ ఆఫ్రికాలో జరిగిన విషయాల గురించి, సాహిత్యం గురించి, ప్రస్తుత్తం భారత దేశంలో ఉన్న పరిస్థితుల గురించి సుదీర్ఘంగా చర్చించుకున్నారు.

### *స్వయం-సహాయం (స్వయంకృషి)*

ఈ చారిత్రిక సమావేశం తరువాత గాంధీజీ బయటకు వచ్చి అక్కడ ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసిపోయి, వారితో ***స్వయం-సహాయం*** (స్వయంకృషి) గురించి చర్చించటం మొదలుపెట్టారు. అప్పుడు ఉపాధ్యాయులను ఒక ప్రశ్న అడిగారు. అది "మీరు, విద్యార్థులు వంటవాళ్లు చేసే పనులు చేసి మీ ఆహారాన్ని మీరే స్వయంగా వండుకుంటే, అప్పుడు ఉపాధ్యాయులు వంటశాలను తమ ఆధీనంలోకి తీసుకోటానికి వీలవుతుంది. అది విద్యార్థులకు స్వయంకృషి గురించి నేర్చుకోటానికి వీలవుతుంది. అది మీకు ఇష్టమేనా" అని ప్రశ్నించారు. ఈ ప్రతిపాదనను కొంతమంది ఉపాధ్యాయులు సమర్థించగా, కొత్తదనం కోసం పరితపించే విద్యార్థులందరు స్వాగతించారు.

అప్పుడు గురుదేవ్ ఠాగూర్ ను తన అభిప్రాయం చెప్పమని కోరగా ఆయన "ఉపాధ్యాయులకు ఇష్టమైతే నాకు అభ్యంతరం లేదు" అని చెప్పారు. విద్యార్థులు ఈ స్వయంకృషి ప్రయోగం '***స్వరాజ్యం***' (Swaraj) కు మూలకారణం అవుతుంది' అని ఉత్సాహపడిపోయారు.

ఈ స్వయంకృషి ప్రయోగంలో William Pearson అత్యంత ఉత్సాహంతో పాల్గొనటం మొదలు పెట్టారు. ఆయన, కొంత మంది ఉపాధ్యాయులు కూరగాయలు కోయటం, మరి కొందరు బియ్యం శుభ్రం చేయటం మొదలుపెట్టారు. నాగేంద్రబాబు, కొంతమంది విద్యార్థులు వంటగది, పరిసరాలు శుభ్రం చేయ టం చేపట్టారు. 125 మంది విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి ప్రతిరోజూ ఈ పనులు శ్రమతో కూడిన ఈ పనులు మొదట్లో ఉత్సాహంగా నిర్వహించారు. కొన్ని రోజుల తరువాత కొంతమంది అలసి పోవటం మొదలుపెట్టారు. వీరి అలసట పోగొట్టటానికి కొందరు విద్యార్థులు 'సితార్' వాయించారు. ఇలా అందరు ఎంతో అభిరుచితో, ఉత్సాహంతో ఈ స్వయం కృషిలో పాల్గనటంవల్ల శాంతినికేతన్ ఒక తేనెపుట్ట లాగా మారి అందులో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి.

శాంతినికేతన్ విద్యార్థులు ఈ 'బెంగాలీ kitchen' ను కేవలం ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు విద్యార్థులతో దీనిని నిర్వహించేటట్లుగా కొన్నిసంస్కరణలు ప్రవేశపెట్టారు. కొన్ని నెలల తరువాత ఈ స్వయంకృషి ప్రయోగం నిలిపివేయబడింది.

***దీనిని గురించి గాంధీజీ వివరణ ఇలా ఉంది.***

"ఈ స్వయం కృషి ప్రయోగం మధ్యలో నిలిపివేసినందువల్ల ఈ ఘనకీర్తి గల సంస్థ ఏమి కోల్పోలేదు. ఉపాధ్యాయులలో చాలామంది ఈ ప్రయోగాన్ని ధృడంగా ఆమోదించారు. ఈ ప్రయోగంలో ఉన్న నూతనత్వం గ్రహించి విద్యార్థులు ఉత్సహాహంతో మనఃపూర్వకంగా స్వాగతించారు. ఈ అనుభవం భవిష్యత్తులో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుంది. గురుదేవ్ కూడా ఈ ప్రయోగాన్ని ఆమోదించటం జరిగింది. విద్యార్థులకు భవిష్యత్తులో ఈ ప్రయోగంలో దాగి ఉన్న భారతదేశ 'స్వరాజ్' నినాదానికి అవసరమైన మూలం (key) గా మారుతుందని నా నమ్మకం."

ఆతరువాత Andrews గాంధీజీతో కలిసి శాంతినికేతన్ నుంచి బర్ద్వాన్ (Burdwan) వెళ్లారు. ఆ సమయంలో ఆండ్రూస్ గాంధీజీని "భారతదేశంలో సత్యాగ్రహం నిర్వహించే సమయం వస్తుందా? వస్తే అది ఎప్పుడు వస్తుందో మీకు ఏమైనా ఆలోచన ఉందా?" అని అడిగారు.

దీనికి గాంధీజీ "అది చెప్పటం కష్టం. ఒక సంవత్సరం పాటు నేను ఏమీ చేయను. గోఖలే నా నుండి ఒక వాగ్దానం తీసుకున్నారు. ***అది నేను ఒక్క సంవత్సరం పాటు దేశం అంతా పర్యటించి అను భవం పొందటం; ఈ పరిశీలన కాలం ముగిసేవరకు ప్రజల ప్రశ్నలపై ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయకపోవటం; ఈ సంవత్సరం పూర్తి అయిన తరువాత కూడా తొందరపడి అనవసరంగా మాట్లాడక పోవటం, అభిప్రాయాలు వెల్లడించకపోవటం.***"

ఇంకా Andrews కు గాంధీజీ ఇలా తెలియజేశారు "ఒకసారి గోఖలే నా హింద్–స్వరాజ్ (Indian Home Rule) గురించి నా అభిప్రాయాలు విన్న తరువాత ఆయన గట్టిగా నవ్వి 'ఒక సంవత్సరం భారతా వనిలో ఉన్న తరువాత నీ అభిప్రాయాలను నీవే సవరించుకుంటావు' అని అన్నారు. ***అందువల్ల ఒక సంవత్సరం గడువు పూర్తి అయిన తరు వాత కూడా నా అభిప్రాయాలు వెల్లడించటానికి నేను తొందర పడను. అయినా అయిదు సంవత్సరాల వరకు సత్యాగ్రహం చేయటానికి అవకాశం, సందర్భం ఉంటుం దని నేను అనుకోను.***" అని సమాధానం ఇచ్చారు.

గాంధీజీ ఒక Steamship లో మూడవ తరగతిలో ప్రయాణం చేసి రంగూన్ చేరుకున్నారు. Dr. మెహతా గృహం తన సొంత గృహంలాగా గాంధీజీ భావించి ఆయనతో కొన్ని రోజులు సంతోషంగా గడి పారు. ఆ సమయంలో హరిద్వార్ లో కుంభ మేళ ఏప్రిల్ నెలలో ప్రారంభమవుతుందని తెలిసింది.

వెంటనే గాంధీజీ రంగూన్ నుంచి కలకత్తా వచ్చి, అక్కడనుంచి అతి కష్టంమీద హరిద్వార్ చేరుకున్నారు. అచ్చట గురుకులం స్థాపించిన 'స్వామి శ్రద్ధానంద ఆర్య' (Mahatma Munshi Ram) తో గాంధీజీ సమావేశమయ్యారు.

ఈ ధర్మశాలలో కుంభమేళ యాత్రికులకు అవసరమయిన గుడారాలు వేసి, మలవిసర్జన కొరకు భూమిలో గుంతలు త్రవ్వి మరుగుదొడ్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఏర్పడింది. మరుగుదొడ్లలో యాత్రీకులు విసర్జించిన మలాన్ని భూమిలో కప్పిపెట్టటం, తదితర పనులు చేయటానికి గాంధీజీ ముందుకు వచ్చారు. ఈ ప్రతిపాదనను స్వామి శ్రద్ధానంద ఆర్య, అచ్చటి వైద్యులు సంతోషంగా అంగీకరించారు. ఈ పనులేగాక యాత్రికులకు స్వామి దర్శనం కల్పించటం, వారితో మతపరమైన చర్చలు జరపటం కూడా గాంధీజీ నిర్వహించే పనులలో ముఖ్య భాగం. అంతేగాక యాత్రికులను స్నాన వాటికలకు తీసుకువెళ్లటం కూడా గాంధీజీ బాధ్యతే. హరిద్వారలో ఆయన నిర్వహించిన ప్రజాహిత కార్యాలు ఆయన కు భవిష్యతులో చాలా ఉపయోగపడ్డాయి. ఈ కార్య నిర్వహణల వల్ల ఆయనకు భోజనం చేయటానికి కూడా సమయం దొరికేది కాదు. గాంధీజీ గురించి తెలిసిన వ్యక్తులు ఆయనను చుట్టుముట్టి అనేక ప్రశ్న లు అడిగినప్పుడు, ఆయనకు విసుగుపుట్టి, కోపానికి వసుడయ్యేవారు.

గురుకులంలోఉన్నప్పుడు గాంధీజీ మహాత్మా మున్షీరాంజీ (Mahatma Munshiramji) ను కలుసుకోవటం జరిగింది. ఆయన గాంధీజీని ఆప్యాయతతో ముంచెత్తారు. అదే సమయంలో ఆయన ఆచార్య రామదేవ్ కు పరిచయం చేయబడినప్పుడు అనేక విషయాలమీద వీరిద్దరు చర్చించుకుని చివరకు చిరకాలం స్నేహితులయ్యారు.

హరిద్వార్ లో ఉన్నప్పుడు యాత్రికుల ప్రోద్బలం వల్ల గాంధీజీ అచ్చట గంగానది మీద ఉన్న Suspension Bridge మీదుగా 20 కి.మీ. దూరంలో ఉన్న హృషీకేశ్ వెళ్లారు. Lakshman Jhula బ్రిడ్జి వద్ద, చుట్టుప్రక్కల కనిపించిన ప్రకృతిని, సహజ దృశ్యాల అందం చూసి ఆయన చాలా ముచ్చటపడ్డారు. అచ్చట అనేకమంది సన్యాసులు గాంధీజీని కలిశారు. వారితో ఆయన హిందూమతం గురించి విపులంగా, దీర్ఘంగా చర్చించటం జరిగింది. హరిద్వార్, హృషికేష్ లో గడిపిన సమయం గాంధీజీకి అమూల్య మైన అనుభవం ఇచ్చిందని ఆయనే తెలియజేశారు.

**అహ్మదాబాద్ లో ఆశ్రమం స్థాపన**

హరిద్వార్ లో ఉన్నప్పుడు 'స్వామి శ్రద్ధానంద ఆర్య' గాంధీజీని హరిద్వార్ లో స్థిరపడమని కోరారు. కొంత మంది కలకత్తా మిత్రులు ఆయన స్థిరపడటానికి వైద్యనాథధామ్ (Vaidyanathadham) సూచించారు.

ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రంలో ఈ ప్రసిద్ధ పట్టణంలో ప్రసిద్ధ 12 శివలింగాలలో ఒకటి ఇచ్చట ఉన్నది. మరి కొందరు గుజరాత్ లోని రాజ్ కోట (Rajkot) లో ఆశ్రమం స్థాపించమని గాంధీజీని గట్టిగా కోరారు.

చివరకు అహ్మదాబాద్ వెళ్ళినప్పుడు గాంధీజీ స్నేహితులు అచ్చట స్థిరపడమని, అచ్చట ఆశ్రమం స్థాపిస్తే దానికి కావలసిన **ఖర్చులు** సమకూర్చుతామని, ఆయన నివసించటానికి ఒక గృహం కూడా ఏర్పాటు చేస్తామని ముందుకువచ్చారు. అంతకుముందు గోఖలే మరణించే ముందు గాంధీజీని ఆశ్రమం అహ్మదాబాద్ లో నెలకొల్పమని, దానికి కావలసిన నిధులను కూడా ఏర్పాటు చేయటం జరిగింది. ఈ పట్టణం గుజరాత్ రాష్ట్రానికి రాజధాని కాబట్టి అచ్చటి సంపన్న పౌరులనుంచి ఇతర చోట్ల కంటే ఇక్కడ ఎక్కువ ఆర్థిక సహాయం వచ్చే అవకాశం ఉంది. అదీ గాక ఈ పట్టణం చేనేత రంగంలో ఒకప్పుడు పురాతన కేంద్రంగా విలసిల్లింది. బ్రిటిష్ వారి పాలనలో ఈ రంగం నాశనం అయింది. అందువల్ల చేనేత వస్త్ర తయారీకి ఈ పట్టణం ఒక పెద్ద కుటీర పరిశ్రమ అభివృద్ధి చెందటానికి వీలవుతుందని గాంధీజీ భావించారు.

కొంతమంది అహ్మదాబాద్ మిత్రులు ఇచ్చటి పౌరులలో అస్పృశ్యత (అంటరానితనం) చాలా అధికంగా ఉందని గాంధీజీకి తెలియజేశారు. అప్పుడు ఆయన మొట్టమొదట యోగ్యమైన, అర్హత గల అంటరాని కులాల అభ్యర్థులకు ఈ

ఆశ్రమంలో ప్రవేశం కలిపిస్తాను అని సమాధానం ఇచ్చారు. ఈ మాటను విని ఒక వైష్ణవ మిత్రుడు గాంధీజీతో "ఏ అస్పృశ్య కులం నుంచి మీకు కావలసిన వ్యక్తులు లభ్యమవుతారు" అని ఎగతాళి చేశాడు.

ఈ ఆశ్రమం స్థాపనకు సహాయం చేసిన ప్రధమ వ్యక్తి గాంధీజీ మిత్రుడు బారిష్టర్ '**జీవన్ లాల్ దేశాయి**'. ఈయన అహ్మదాబాద్ కు సమీపంలో ఉన్న తన స్వగృహం Kochrab బంగళా ఈ ఆశ్రమం కోసం ఇవ్వగా గాంధీజీ దానికి అద్దె చెల్లించే పద్ధతిలో తీసుకున్నారు.

ఆశ్రమ స్థాపన నిర్ణయం అయినా తరువాత దీనికి ఒక పేరు పెట్టాలని నిర్ణయించినప్పుడు కొంద రు '**తపోవనం**' పేరును మరి కొందరు '**సేవాశ్రమం**' పేరును సూచించారు. చివరకు గాంధీజీతో సహా చాలామంది సేవాశ్రమం పేరును స్వాగతించారు. ఆ విధంగా1915 లో మే నెల 25 వ తేదీన గాంధీజీ ఈ ఆశ్రమాన్ని స్థాపించారు. అది '**Kochrab ఆశ్రమం**' గా పేరొందింది. గాంధీజీ, కస్తూరీబాయి, అయన పుత్రులు, ఇతర కుటుంబ సభ్యులు ఈ ఆశ్రమంలో నివాసం ఏర్పరచుకున్నారు. వీరందరు కలిసి ఒక వంటగది ఏర్పాటు చేసుకున్నారు.

ఈ ఆశ్రమంలోని విద్యార్థులు గాంధీజీ ఉద్భోదించే ఆలోచనల ప్రకారం సత్యాగ్రహం, స్వయం సమృద్ధి, స్వదేశీ, తదితర విషయాలు నేర్చుకుంటారు. అంతేగాక వీరు పేదల ఉద్ధరణ, అంటరానితనం తొలగించుట, ఉన్నత విద్య ప్రోత్సహించుట, స్త్రీ–పురుష సమానత్వం, పారిశుధ్యం, మొదలగు విషయాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. ఈ ఆశ్రమం మానవ సమానత్వం పెపొందించటానికి కృషిచేస్తుంది.

ఈ ఆశ్రమం నిర్వహించటానికి కొంతమంది 30 మంది ఉద్యోగులను గాంధీజీ నియమించారు. వీరిలో 25 మంది పురుషులు, అయిదుగురు స్త్రీలు ఉన్నారు. వీరిలో 13 మంది తమిళులు, ఆంధ్రులు. ఆశ్రమం ప్రారంభం అయిన తరువాత, ఉద్యోగులతో సహా గాంధీజీ కుటుంబ సభ్యులందరు ఒకే వంట శాలలో భోజనం చేస్తూ ఒక కుటుంబ సభ్యులలాగా నివసించటం ప్రారంభించారు.



అహ్మదాబాద్ లోని Kochrab ఆశ్రమం: భారత స్వాతంత్ర్య పోరాటం జన్మస్థానం, మహాత్మా గాంధి మొదటి నివాసం.

---------సశేషం-------..

***వచ్చే నెల సంచిక ద్వారా గాంధీజీ గురించి మరింత ఆసక్తికర విశేషాల గురించి తెలుసుకుందాము.***

COMMENTS

.